

4 సింగిల్ విండోలకు పాలక వర్గాలు

కడప రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 4 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇందులో రాజంపేట ఏఎంసీ చైర్మన్‌గా గన్నె సుబ్బనరసింహానాయుడు, పులివెందుల ఏఎంసీ చైర్మన్‌గా జి.అమరనాథ యాదవ్, ప్రొద్దుటూరు ఏఎంసీ చైర్మన్‌గా వద్ది సురేఖ, బద్వేలు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా వరిశెట్టి సుప్రజలను ప్రభుత్వం నియమించింది.

భక్తిశ్రద్ధలతో మాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న ఆస్థాన పండితులు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో గురువారం పోతులూరి వీరబ్రహ్మంగారి సమేత గోవిందమాంబ మాస కల్యాణ మహోత్సవాన్ని ఆస్థాన పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా శుద్ధ ద్వాదశి రోజున మాస కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తామని బ్రహ్మంగారిమఠం దేవస్థాన మేనేజరు ఈశ్వరాయాచారి తెలిపారు. గురువారం జరిగిన మాస కల్యాణ మహోత్సవంలో దాత నల్లపాటి వెంకట శరత్‌చంద్ర వారి కుటుంబ సభ్యులతో పాటు, తాత్కాలిక మాస కల్యాణ ఉభయదాతలు సరళ నరసింహారెడ్డి, హారిక చంద్రప్రకాశ్‌రెడ్డి, భార్గవి సూర్యప్రకాశ్‌రెడ్డి, సంధ్య ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవంలో పూర్వపు మఠాధిపతులు జ్యేష్టపుత్రుడు వెంకటాద్రిస్వామి పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికల ప్రదర్శన



మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికలను చూస్తున్న భక్తులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 4 ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో గురువారం మిలాదున్ నబి పండుగను పురస్కరించుకుని మహమ్మద్ ప్రవక్త జ్ఞాపికలను ప్రదర్శనగా పెట్టారు. ఆస్తానయే గౌసియా దర్గా ప్రాంగణంలో ఈ జ్ఞాపికలను ప్రదర్శనగా పెట్టారు. దర్గా పీఠాధిపతి గౌసపీరా ఖాద్రి, ఆయన కుమారుడు తాహీర్‌పీరాఖాద్రి తదితరులు భక్తులకు మహమ్మద్ ప్రవక్త గురించి వివరించారు. మహమ్మద్ ప్రవక్తకు సంబంధించిన 20 రకాల చిహ్నాలను ప్రదర్శనగా పెట్టి తెలియజేశారు. భక్తులు విశేషంగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కుకున్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

- జిల్లా ప్రధాన జడ్జి యామిని



కడప రూరల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని డీఎల్‌ఎస్‌ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో బ్యాంక్ అధికారులు, చిట్‌ఫండ్ ప్రతినిధులు, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, పీపీలు, ఏపీపీలు, ఏజీపీలతో పాటు వర్చువల్ పద్ధతిలో న్యాయాధికారులతోను ముందస్తు లోక్ అదాలత్ నిర్వహించి వారి పరిధిలోని కేసుల వివరాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి మాట్లాడుతూ 13న నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి కృషి చేసి కడప డీఎల్‌ఎస్‌ఏను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం రాజీపడే కేసులను గుర్తించి నేషనల్ మెగా లోక్‌అదాలత్‌కు అధికంగా వచ్చేలా చూడాలన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులకు ఎటువంటి ఖర్చు ఉండదన్నారు. ఇక్కడ పరిష్కారం అయిన కేసు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమైందన్నారు. లోక్ అదాలత్ పరిధిలోకి రాని కేసులంటూ ఏవీ లేవన్నారు.

ఆచార్య దేవోభవ







- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 60 మంది ఎంపిక
- ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నేడు ప్రదానం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లి, దండ్రి తర్వాత గురువే ప్రధానం. తెల్లటి పేపర్ లాంటి మనస్తత్వం కలిగిన పిల్లలను తీర్చిదిద్దడంలో గురువు ప్రాధాన్యం మొదటిది. భారత రాష్ట్రపతిగా పనిచేసిన సర్వేపల్లె రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడుగా ఎందరో జీవితాలను తీర్చిదిద్ది వారి హృదయాలలో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతి అయిన సెప్టెంబరు 5న ఏటా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తుండడంతో ప్రభుత్వ విద్యాలయాలు ప్రగతిపథంలో పయనిస్తున్నాయి. మౌలిక సౌకర్యాల పెంపుదల చేయడం, ఆంగ్లవిద్య, కంప్యూటర్ విద్య అందుబాటులోకి తీసుకురావడంతో ప్రభుత్వ పాఠశాలలపై గ్రామస్తుల్లో నమ్మకం పెరిగింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ కొత్త కొత్త బోధనోపకరణాలను ఉపయోగిస్తూ విద్యార్థులకు ఆసక్తి కలిగేలా బోధిస్తున్నారు. 60 మంది ఉపాధ్యాయులను జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు డీఈవో షంషుద్దీన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సభాభవనంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో వారికి అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు.

కనిపించే దేవుళ్లు ఉపాధ్యాయులే



మనకు తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు పునర్జన్మ ఇస్తారు. విద్యార్థి దశ నుంచి మనకు చదువులు చెప్పడంతో పాటు క్రమశిక్షణ నేర్పి మనం ఎంతో ఎత్తుకు ఎదిగేందుకు ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది. మనకు కంటికి కనిపించే దేవుళ్లు ఉపాధ్యాయులే. 2008 నుంచి 2010 వరకు టీచర్‌గా విధులు నిర్వహించాను. విద్యార్థులను సరైన సన్మార్గంలో నడిపించేందుకు కృషిచేశాను. నేను ఈ స్థాయికి వచ్చానంటే కేవలం మా గురువుల వల్లనే. ప్రతిరోజు వారిని గుర్తు చేసుకుంటాను. సమాజానికి ఉపయోగపడే మేధావులను తీర్చిదిద్దే అవకాశం ఒక్క గురువుకి మాత్రమే దొరుకుతుంది.

- ఈజీ అశోక్‌కుమార్, ఎస్పీ

జీవితం, జీవనం నేర్పించే మహనీయులు

జీవితానికి ఒక అర్థాన్ని నిర్దేశించేది గురువే. అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసరింపజేసేది గురువు. అందుకే తల్లి తండ్రి తర్వాత భగవంతుని కంటే ముందు గురువుకు స్థానమిచ్చారు. తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు జ్ఞానమనే వెలుగునిస్తాడు. జ్ఞానంతోనే జీవితానికి అర్థం పరమార్థం లభిస్తుంది. తాము ఉన్నత స్థాయికి ఎదిగేందుకు గురువులు వారికి ఏ విధంగా ప్రోత్సహించారో పలువురు జిల్లా అధికారులు గుర్తు చేసుకున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

ప్రధానోపాధ్యాయుల విభాగంలో..: మెర్సీ మాలిని (ఎగువరామాపురం), వై.విజయ (మైదుకూరు), కేవీ నాగిరెడ్డి (వేముల), కె.సరస్వతి (మూలవంక), పి.నాగమణి (కడప గాంధీనగర్), ఎం.రామకృష్ణమ్మ (జమ్మలమడుగు), కె.లక్ష్మీకేశవమ్మ (భాకరరాపేట).

స్కూల్ అసిస్టెంట్ విభాగంలో..: కె.రవిశంకర్ (ముద్దనూరు), ఎ.ఎరికలరెడ్డి (మహదేవపల్లె), టి.సావిత్రమ్మ (చిలమకూరు), పి.మహాలక్ష్మి (తాళ్లప్రొద్దుటూరు), పీవీ పద్మనాభరెడ్డి (సింహాద్రిపుర), పి.నాగకృష్ణారెడ్డి (కొండాపురం), సయ్యద్ నూర్ (కడప), జనార్దన్ (ఎద్దులపల్లె), ఎం.ఎస్తేర్ సుకుమారి (అంగడివీధి), బీవీ సుబ్బారెడ్డి (నరసాపురం), బి.శివప్రసాద్ (బద్వేలు), పి.భార్గవి ప్రియదర్శిని (పులివెందుల), పీఆర్ మంజులదేవి (ఎర్రగుంట్ల), వీవీ గాయత్రి (ప్రొద్దుటూరు), ఎన్ఆర్వీ ప్రసాద్‌రెడ్డి (పెద్దరంగాపురం), బి.సుధాకర్‌రెడ్డి (ఇస్లాంపురం), ఎస్.ఫిరోజ్‌జహాన్ (వేంపల్లె), ఎస్.ఓబయ్య (బద్వేలు), ఎ.అరుణకుమారి (రామరాజుపల్లె), ఎస్.గురవయ్య (మల్లేమ్మపల్లె), ఎస్.ఏచాంద్‌బాష (ఎర్రగుంట్ల), జె.సుబ్రమణ్యం (దేవగుడి), శ్రీదీపారెడ్డి (వల్లూరు) డి.నాగరాజు (కడప).

ఎస్జీటీ విభాగంలో..: ఏవీ సుచిత్రకుమారి (విరాట్‌నగర్), కె.కృష్ణయ్య (నక్కలదిన్నె), జి.శివరామకృష్ణంరాజు (పెన్నపేరూరు), బి.శ్రీనివాసులు (అయ్యవారిపల్లె), ఎస్.ఖాసింవల్లి (బాలయ్యపల్లె), పి.సుహాసిని (మర్రిమాకులపల్లె), బి.భాస్కర్‌రెడ్డి (తిమ్మారెడ్డిపల్లె), ఎస్.రామకృష్ణారెడ్డి (బి.కోడూరు), బి.ఆదిశేషారెడ్డి (రంగసముద్రం), కె.వెంకటసుబ్బన్న (పోరుమామిళ్ల), బి.దస్తగిరి (రాచనాయిపల్లె), ఎన్.రాజారావు (దౌలతాపురం), సి.వీరారెడ్డి (గంగయ్యపల్లె), ఆర్.గురవయ్య (రంగసముద్రం), ఆర్వీ సౌభాగ్యలక్ష్మిదేవి (కొత్తపల్లె), ఎన్.రాధిక (రెడ్డికొట్టాల), మేరీ సువర్ణ (రామరాజుపల్లె), ఎన్.శ్రీనివాసులు (కొర్రపాటిపల్లె), ఎ.పెంచలయ్య (ప్రొద్దుటూరు), బి.ప్రభుభూషణ (చింతరాజుపాలెం), పి.గాయత్రి (ప్రొద్దుటూరు), బి.ఈశ్వరరావు (రాజాసాహెబ్‌పేట), సి.సుదర్శన్ (బక్కన్నగారిపల్లె), ఎస్వీ సత్యనారాయణ (పుల్లారెడ్డిపల్లె), ఐ.రహీంబకాష్ (అంగడివీధి), ఎస్.ఫాతిమా సుల్తానా (కొండపేట), అబుద్దినిసా బేగం (మైదుకూరు), ఎ.ఫరీదా భాను (వేంపల్లె). అలాగే స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో.. చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్యను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేశారు

విద్యతో పాటు విలువలూ నేర్పించారు



మంచి గురువుల ద్వారా విద్యాభ్యాసం అందుకోవడం మా అదృష్టం. ప్రాథమిక విద్య కడపలోని నిర్మలా కాన్వెంట్‌లో మొదలైంది. నా ప్రథమ గురువు సావిత్రి అనే టీచర్. ఆమె ద్వారానే అక్షరాభ్యాసం మొదలైంది. ఇప్పటికీ గురువు అనగానే ఆమె గుర్తుకొస్తుంది. ఆ తర్వాత చిత్తూరులోని సైనిక్ స్కూల్లో విద్యాభ్యాసం కొనసాగింది. అక్కడ కస్తూరి, గీత అనే ఉపాధ్యాయులు మమ్మల్ని ఎంతగానో ప్రోత్సహించేవారు. విద్యతో పాటు మానవ విలువల గురించి నేర్పించారు. విద్యా బోధనతో పాటు క్రమశిక్షణ, లక్ష్యం సాధించడంలో మెలకువలు నేర్పారు. అన్ని విధాలుగా మంచి గురువులు దొరకడంతో విద్యనభ్యసించి మంచి జీవితాన్ని పొందగలిగాము.

- డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, పీడీ, డీఆర్‌డీఏ

నా మొదటి గురువు మా నాన్నగారే



నా మొదటి గురువు మా నాన్నగారే. ఇక పాఠశాల విషయానికొస్తే ప్రాథమిక విద్యలో శిఖామణి అనే గురువుగారు నాకు ఎంతో ఇష్టమైన వ్యక్తి. క్రమశిక్షణతో కూడిన విద్యను అందించారు. ఆయన బోధించిన విధానం ఉన్నత విద్య అభ్యసించేందుకు తొలిమెట్టుగా ఏర్పడింది. ఆ తర్వాత హైస్కూల్లో మురళీమోహన్ అనే లెక్కల మాస్టారు బోధన వల్ల ఆ సబ్జెక్టుపై నాకు మక్కువ ఏర్పడింది. వందకు వంద మార్కులు సాధించగలిగాను. మేము చదువుకునే రోజుల్లో గురువులు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించారు. వాళ్ల బోధన వల్లే ఈరోజు ఈ స్థాయిలో ఉద్యోగంలో కొనసాగుతున్నాను.

- కొమ్మద్ది సరస్వతి, డిప్యూటీ డైరెక్టర్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్

ఏడుగురికి రాష్ట్రస్థాయి పురస్కారాలు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకు కెందిన ఏడుగురిని రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ప్రభుత్వం ఎంపిక చేసింది. యోగివేమన విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ ప్రొఫెసర్ కె.రియాజున్నీసా, కెమిస్ట్రీ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు. కడపనగరం ప్రభుత్వ పురుషుల కళాశాల బాటనీ అధ్యాపకులు డాక్టర్ ఎంవీ సురేశ్‌బాబు, ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల హిస్టరీ అధ్యాపకులు డాక్టర్ బి.ఏకోనారాయణ పురస్కారాలకు ఎంపికయ్యారు. పెండిమర్రి మండలం ఎగువపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ స్కూల్ అసిస్టెంట్ ఎఫ్ఎంఎస్ ఖాదర్‌బాషా, ప్రొద్దుటూరు లింగారెడ్డినగర్‌కి చెందిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ షేక్ జవహర్ మునీర్, కాశినాయన మండలం రెడ్డికొట్టాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఎస్జీటీ బి.ప్రమీలజ్యోతి ఎంపికయ్యారు. వీందరూ శుక్రవారం విజయవాడలో పురస్కారాలు అందుకోనున్నారు.



ప్రొఫెసర్ కె.రియాజున్నీసా



ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు



డాక్టర్ ఎంవీ సురేశ్‌బాబు

ఏఎఫ్ఏయూ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించిన 2, 4 సెమిస్టర్లు, సప్లిమెంటరీ, ప్రత్యేకంగా నిర్వహించిన పదవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వర్సిటీ వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ గురువారం విడుదల చేశారు. వర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.ఫణీంద్రరెడ్డి మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో 60శాతం మంది బాలురు, 40శాతం మంది బాలికలు ఉన్నారన్నారు. ఉత్తీర్ణత ఉత్తీర్ణత సాధించని వారికి సప్లిమెంటరీ అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయప్రకాశ్‌రెడ్డి, నారపరెడ్డి, వర్సిటీ ప్రజాసంబంధాల అధికారి వి.శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేపు 5కే రెడ్‌రన్ మారథాన్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖలు సంయుక్తంగా హెచ్‌ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు 6వ తేదీ శనివారం ఉదయం 5-30 గంటలకు 5 కే రెడ్‌రన్ మారథాన్ నిర్వహించనున్నామని డీఎంహెచ్‌ఓ నాగరాజు, అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో చదువుతున్న 17-25 ఏళ్ల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. విజేతలకు పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జండర్స్‌కు వేరు వేరుగా మొదటి బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.7 వేలు చొప్పున ఇస్తామని పేర్కొన్నారు. ఇక్కడ గెలిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. మరిన్ని వివరాలకు 9866094531, 9052038569 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

7న ఫారెస్ట్ ఉద్యోగాలకు పరీక్షలు

- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ ఉద్యోగాల కోసం 7వ తేదీ ఆదివారం జిల్లాలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీసుకు సంబంధించి ఈ నెల 7వతేదీన ఆఫ్‌లైన్ స్క్రీనింగ్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి 12-30 గంటల వరకు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసరు ఉద్యోగాలకు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5-30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్ష కంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని అధికారులు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. కాగా.. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సహాయార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని విద్యార్థులకు ఏదైనా సమాచారం కావాలంటే 08562 246344 నెంబరుకు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 5, 6 తేదీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, 7 వతేదీ ఉదయం 11 వరకు సిబ్బంది కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ఎర్రబల్లె చెరువుకు నీరు

- ఇచ్చిన హామీ నెరవేర్చాం : బీటెక్ రవి



నీటిని విడుదల చేసిన అనంతరం గంగమ్మకు సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవి, చిత్రంలో కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి తదితరులు

పులివెందుల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎర్రబల్లె చెరువుకు నీరు ఇస్తామన్న హామీని నెరవేర్చామని నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి తెలిపారు. కదిరి నియోజకవర్గం మీదుగా ప్రవహిస్తున్న జీఎన్‌ఎస్‌ఎస్ కాల్వ నుంచి గేట్లు ఎత్తి గురువారం ఎర్రబల్లె చెరువుకు నీరు విడుదల చేశారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, కడప ఎమ్మెల్యే మాధవి, బీటెక్ రవి పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అందరి సహకారంతో నిలబెట్టుకున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమను రతనాల సీమగా మార్చాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. అనంతరం బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా ఎర్రబల్లె చెరువుకు నీరు అందిస్తామని మాట ఇచ్చామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం నీటిని విడుదల చేశామన్నారు. 30 నుంచి 40రోజుల్లో ఎర్రబల్లెచెరువు నిండుతుందన్నారు. తాము ఎర్రబల్లె చెరువుకు నీరిస్తామని చెబితే.. మా నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండి చేయలేని పని మీరు చేస్తారా? కేవలం ఎన్నికల కోసమే ఈ మాటలు అని అవహేళన చేసిన వారున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి నీరు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర హైలెవెల్ కమిటీ చైర్మన్ జోగిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తొండూరు మాజీ ఉప మండలాధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, హజ్ కమిటీ డైరెక్టర్ మాబ్బాష, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు సోలార్ పనులు

- రూ.1700 కోట్లతో 1500 ఎకరాల్లో..



↑ కొండాపురం మండలం టీకోడూరు వద్ద సోలార్ ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానెళ్లు



సోలార్ పవర్‌కు అనుసంధానంగా ఏర్పాటుచేసిన విద్యుత్ సబ్‌స్టేషన్

కొండాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టీకోడూరు గ్రామం సమీపంలో కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మెగా సోలార్ పవర్‌ప్లాంట్ పనులు తుదిదశకు చేరుకున్నాయి. 300 మెగావాట్ల సామర్థ్యంతో 1500 ఎకరాల్లో నిర్మిస్తున్న ఈ మెగా సోలార్‌పవర్ ప్లాంట్ పనులు చకచకా జరుగుతున్నాయి. దీనిని రూ.1700 కోట్ల వ్యయంతో కేంద్రప్రభుత్వం నిర్మిస్తోంది. 2024 సంవత్సరంలో ప్రారంభమైన పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఈ సోలార్ ప్రాజెక్టుకు రైతుల నుంచి 1500 ఎకరాల భూమిని సేకరించారు. లీజు ప్రాతిపదికన సంవత్సరానికి రూ.30,000 చెల్లిస్తారు. ప్రస్తుతం రైతుల అంగీకారం మేరకు వారి భూముల్లోనే సోలార్ ప్యానెళ్లు అమర్చే ప్రక్రియ దాదాపు పూర్తి కావస్తోందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ ప్రాంతంలోనే విద్యుత్‌సబ్‌స్టేషన్‌ను కూడా ఏర్పాటుచేశారు. సోలార్ ప్యానెళ్ల నుంచి సౌరశక్తిని తీసుకుని దానిని విద్యుతుసబ్‌స్టేషన్‌కు మళ్లిస్తారు. తద్వారా గ్రిడ్‌కు అనుసంధానం చేస్తారు. ఆ ప్రాజెక్టు ద్వారా దాదాపు 300 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

మూడునెలల్లో పూర్తికి సన్నాహాలు

సోలార్‌ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయి. మూడునెలల్లో పూర్తిచేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో స్థానికంగా 80 శాతం మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం.

- సంజయ్, సోలార్‌ప్రాజెక్టు ఇన్‌చార్జి

కన్నతండ్రే కాలయముడు



హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్నబంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక



ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతో పాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసు లు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్‌కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పదిమంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



జి.శంకర (ఫైల్)

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు జి.శంకర (46) మృతి చెందాడు. బుధవారం రాత్రి మదనపల్లె మండలం బసినికొండ గ్రామం, బైపాస్ నాలుగు రోడ్ల కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు గురువారం మృతి చెందారు. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె టమోటా మార్కెట్ మాజీ చైర్మన్ భర్త తట్టి శ్రీనివాసులురెడ్డి కారును డ్రైవర్ షేక్ బావాజాన్ వేగంగా వచ్చి నాలుగు రోడ్ల కూడలిలో నిలిచి ఉన్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిమ్మనపల్లె మండలం ఎగువ మాచిరెడ్డిగారిపల్లెకు చెందిన జి.శంకర మృతి చెందాడు. గాయపడిన మరో వ్యక్తి బొమ్మనచెరువు గోపాల్ చికిత్స పొందుతున్నాడు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలం కొత్తిండ్లులో బుధవారం రాత్రి జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు కొత్తపల్లె పంచాయతీ రంగారెడ్డి కాలనీ కొత్తిండ్లు చర్చి వీధికి చెందిన షేక్ అర్షద్‌బాషా కుమారుడు షేక్ మహమ్మద్ జైన్ (23) ఇంటిపైన గదిలో ఫ్యాన్‌కు బెల్టుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇతను కామెర్ల వ్యాధితో ఏడాదిగా బాధపడుతూ ఆస్పత్రుల్లో, నాటు వైద్యం చేయించారని, అయినా వ్యాధి నయం కాకపోవడంతో ఇంటివద్దే ఉంటున్నాడు. రాత్రి 9 గంటలైనా భోజనానికి రాకపోవడంతో తండ్రి గదిలోకి వెళ్లి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తండ్రి షేక్ అర్షద్‌బాషా ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో దేవిక (56) దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మండలంలోని తట్టివారి పల్లెకు చెందిన దేవిక తట్టివారిపల్లె బైపాస్ సర్కిల్ సమీపంలోని ఓ వైసీపీ నేత ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తోంది. అక్కడికి వెళ్లేందుకు నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని గాయపడింది. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించే క్రమంలో ఆస్పత్రిలోనే మృతి చెందింది. తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

● డిప్యూటీ విజిలెన్స్ అధికారి గీతావాణి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ విజిలెన్స్ అధికారి గీతావాణి పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్టలోని ఎరువుల దుకాణాలను మండల అధికారి మంజులరాణి సీఐ బాబుతో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా విక్రయించాలని, మండలంలోని ఎరువు దుకాణాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు యూరియా అమ్ముతున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

అన్వేషణాత్మక ఆలోచనలతో పరిశోధనలు

● ఇన్‌స్పైర్ మనాక్‌తో కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం

● దరఖాస్తులకు ఈనెల 15 వరకు గడువు

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అన్వేషణాత్మక ఆలోచనలను ప్రోత్సహించి పరిశోధనల వైపు ఆసక్తిని పెంపొందింపజేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనాక్ నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 6 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిని పరిశీలించి ఒక లక్ష అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ఒక్కొక్క విద్యార్థికి రూ.10 వేలు చొప్పున వారి అకౌంట్‌కు నేరుగా నగదును బదిలీ చేస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వీరికి ప్రాజెక్టు పోటీలు నిర్వహిస్తారు. చివరికి 60 మంది విద్యార్థుల ప్రాజెక్టులను ఎంపిక చేసి వాటిని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుంది. 2025-26 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జూన్ 15 నుంచి ప్రారంభించగా ఇప్పటివరకు 850 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 15వ తేదీతో గడువు ముగుస్తుంది. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఒక్కొక్క పాఠశాల నుంచి ఐదు మంది ఏడు నామినేషన్లు సమర్పించాల్సి ఉందన్నారు.



అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ (ఫైల్)

జిల్లా అగ్రస్థానమే లక్ష్యం

అన్నమయ్య జిల్లాను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. గత సంవత్సరం అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచిందని, ఈ సంవత్సరం అగ్రస్థానమే లక్ష్యంగా 3 వేల ప్రాజెక్టులు సమర్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సృజనాత్మకత, ఆవిష్కరణల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి సరైన నివేదికను అందించినట్లు తెలిపారు.

అన్ని పాఠశాలలు నామినేషన్లు సమర్పించాలి

జిల్లాలో ప్రైవేటు పాఠశాలలతో సహా అన్ని ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నామినేషన్లు సమర్పించారు. ఈ పథకం యువ విద్యార్థులకు సైన్స్ అధ్యయనం చేయడానికి పరిశోధన, వృత్తి పట్ల ఆసక్తిని పెంచడానికి భారతదేశంలో విస్తృత ఆవిష్కరణ సంస్కృతిని పెంపొందించడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి అన్ని పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించి నామినేషన్లు సమర్పించడానికి ఉపాధ్యాయులు, ఎంఈవోలు బాధ్యత వహించాలి.

- డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి

ఇన్‌స్పైర్ పథకం చక్కగా ఉపయోగించుకోవాలి

చిన్న వయస్సులోనే విద్యార్థులను సైన్స్‌ను అనుకరించడానికి పరిశోధన ఆధారిత కెరీర్ వైపు ప్రేరేపించడానికి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డును ప్రతి ఒక్కరూ చక్కగా ఉపయోగించుకోవాలి. ఇందుకోసం గైడ్ టీచర్లకు శిక్షణ ఇచ్చాం. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేస్తున్నాం. అగ్రస్థానమే లక్ష్యంగా సైన్స్ ఉపాధ్యాయులు అందరూ పనిచేస్తున్నారు. అందరి సహకారంతో లక్ష్యాన్ని సాధిస్తాం.

- మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి జిల్లా కోసం పోరాడు...

● రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ జగన్‌మోహన్‌రాజు



విలేకరులతో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ముందు ఎమ్మెల్యే పదవికి, వైసీపీకి రాజీనామా చేసి రాజంపేట ప్రజలతో కలిసి జిల్లా కేంద్రం కోసం పోరాడాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. గురువారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీకి వెళ్లని వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజల బాధలు తెలియవన్నారు. వైసీపీ హయాంలో రాజంపేటకు అన్యాయం చేసిన ఆకేపాటి తన ఆస్తులు మాత్రం బాగా పెంచుకున్నారని విమర్శించారు. రాజంపేటను జిల్లా కేంద్రం కాకుండా చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని ఆకేపాడుకు పిలిపించుకుని సంబరాలు చేసుకున్నది ఎవరో అందరికీ తెలిసిందేనన్నారు. చంద్రబాబును ప్రశ్నించే అర్హత ఆకేపాటికి లేదని, దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి రాజంపేట జిల్లా కేంద్రం కోసం పోరాడాలన్నారు. రాజంపేటకు అన్యాయం చేసినప్పుడు జగన్‌మోహన్‌రెడ్డిని ఆకేపాటి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రాజంపేట నియోజకవర్గంలోని ప్రాజెక్టులను, ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కేంద్రాలకు, మెడికల్ కళాశాల మదనపల్లెకు తరలించుకుపోతుంటే ఆయన ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. వెంకటేశ్వరస్వామి ఆస్తులను కాజేసేందుకు ఉన్న శ్రద్ధ ప్రజలపై ఉంటే రాజంపేటకు జిల్లా కేంద్రం వచ్చేదని ఆరోపించారు. రాజంపేట అభివృద్ధి, జిల్లా కేంద్రం లక్ష్యంగా టీడీపీ పనిచేస్తుందన్నారు. రాజంపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువస్తామన్నారు. సమావేశంలో రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, నాగేశ్వర్‌నాయుడు, ఎస్‌కే కరీం, గీతాంజలి రమణ, గంపా శివ, మందా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే వెంటనే పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను 1వ తేదీలోగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన రాచవేటివారిపల్లి, కొండయ్యగారిపల్లి, ముష్టూరు పంచాయతుల్లో స్వామిత్వ సర్వే తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన సాంకేతికత, మ్యాపింగ్ కోసం ఏర్పాటైన పథకం అన్నారు. 2021 నుంచి 2025వరకు దేశవ్యాప్తంగా 6.62లక్షల గ్రామాల్లో ఈ పథకం సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఆస్తి డేటాను డ్రోన్‌ల సహాయంతో వివిధ సాంకేతికతతో చేపడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈనెల 10లోగా సర్వే పూర్తి చేసి 15లోపల వెక్టరైజేషన్ చేసి సంబంధిత రెవెన్యూ విలేజ్, గ్రామ కంఠము, ఎక్స్‌టెండెడ్ గ్రామ కంఠము తయారు చేసి నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా వుండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల దుకాణాల సందర్శన

నిమ్మనపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు ఉత్పత్తి దారుల సంఘం ద్వారా రైతుల కోసం ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాలు బాగున్నాయని శ్రీసత్యసాయి జిల్లా డీఆర్‌డీఏ డైరెక్టర్ నరసయ్య తెలిపారు. గురువారం సత్యసాయి జిల్లా నుంచి శాప్ సీఎంఎస్ వృత్తి సంస్థ అధ్వర్యంలో బృందం సభ్యులతో కలిసి రైతు ఉత్పత్తి ఎరువుల దుకాణాలను క్షేత్రస్థాయి సందర్శనకు విచ్చేశారు. అయన రైతుల పంటలకు సంబంధించి ఏ విధంగా ఎరువులు, క్రిమి సంహారక మందులు ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్నారని ఆరా తీశారు. రైతుల ఇంటి వద్దకే ఎరువులు క్రిమి సంహారక మందులు పంపిణీ చేయడం హర్షంచదగ్గ విషయమన్నారు. యూరియాతో పాటు మిగిలిన డీఏపీ ఇతర ప్రభుత్వ రేటుకు రైతులకు పంపిణీ చేస్తూ బిల్లులు కూడా కంప్యూటరైజ్ చేస్తూ లాభాల్లో నడిపిస్తుండడం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో శ్రీసత్యసాయి జిల్లాలో ఐదు ఎరువుల దుకాణాలను వృత్తి సంస్థ ద్వారా ప్రారంభించేందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలకు వచ్చినట్లు తెలిపారు. అనంతరం వృత్తి టీమ్ సభ్యులతో కలిసి దుకాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీపీఎం సత్యనారాయణ, జీవనోపాదుల డీపీఎం రామమోహన్, డీపీఎం ఫైనాన్స్ రామిరెడ్డి, డీపీఎం, సీఆర్‌బీ అరుణ, వృత్తి కోఆర్డినేటర్ గోపినాథ్, ఏపీ మాస్ వాసుదేవరెడ్డి, ఏపీఎంలు సుదర్శన్‌రాజు, మురళి, రమణప్ప, తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లకు రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నా క్యాంటీన్‌ల నిర్వహణకు మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి రూ.2 లక్షల నగదును విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో రెండు అన్నా క్యాంటీన్‌ల నిర్వహణకు గానూ గురువారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నగదును విరాళంగా అందజేసినట్లు తెలిపారు. పేదలకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు.

బెండ సాగు... ఆదాయం బాగు

ఆశించిన ధర, అధిక దిగుబడులు

ఎకరాకు రూ.1,20,000 ఆదాయం

కడప రూరల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాకాలం పంట కింద సాగు చేసిన బెండ అన్నదాతలకు సిరులు కురిపిస్తోంది. ఆశించిన దిగుబడులతో పాటు, మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతుండడంతో రైతులు ఆనందంలో ఉన్నారు.

సిద్దవటం మండలంలోని ఖాజీపల్లె, టక్కోలి, కాకిపల్లె, డేగలవాండ్లపల్లె, పాత టక్కోలు, మంగళవాండ్లపల్లె, కడపాయపల్లె, లింగంపల్లె, మాచుపల్లె తురకపల్లె, మూలపల్లె తదితర గ్రామాలు కూరగాయల పంటల సాగుకు ప్రసిద్ధి. పలు రకాల కూరగాయలను ఇక్కడి రైతులు పండిస్తుంటారు. ఈ ఏడాది పై గ్రామాల రైతులు దాదాపు 100 ఎకరాల వరకు బెండ పంటను సాగుచేశారు. ఎకరాకు 4 నుంచి 6 కిలోలు వరకు విత్తనం వాడారు. విత్తనశుద్ధితో పాటు, ఎరువులు, పురుగుమందుల వాడకంతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలను చేపట్టారు. దీంతో ప్రస్తుతం పంట ఆశించిన దిగుబడులను అందిస్తోంది. మార్కెట్‌లో మంచి ధర పలుకడంతో రైతులు లాభాలు ఆర్జిసున్నారు.

రాబడి ఇలా...

బెండ పంట సాగు చేశాక ప్రకృతి అనుకూలించడం, పురుగులు, తెగుళ్లు లేకపోవడంతో అన్నదాతల శ్రమ ఫలించింది. పంట ఆశాజనకంగా ఉంది. ధరలు కూడా బాగున్నాయి. మార్కెట్‌లో కేజీ బెండ ధర రూ.20 నుంచి రూ.40ల వరకు పలుకుతోంది. సరాసరి రూ.20లు చొప్పున ధరలు లభిస్తున్నాయి. ఒక ఎకరాకు 5 నుంచి 6 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ మేరకు ప్రతి రోజు 1500 కేజీల వరకు కాయలను తెంపుతున్నారు. రైతులే నేరుగా సగటున కేజీ రూ.15లు చొప్పున కడప రైతు బజారుతో పాటు, పెద్ద మార్కెట్‌లో హోల్‌సేల్‌గా అమ్ముతున్నారు. ఇలా ప్రతి రోజు 150 కేజీలకు రూ.3000 వరకు రైతుకు వస్తుండగా ఇందులో కోత, రవాణా ఖర్చుల కింద రూ.700 పోను రూ.2300 వరకు రైతుకు దక్కుతోంది. దాదాపు 2 నెలల వరకు పంట కోతలు జరుగుతూనే ఉంటాయి. ఇలా ఎకరాకు రూ.1,80,000లకు పైగా ఆదాయం వస్తోంది. ఎకరాకు సాగు ఖర్చులు రూ.50,000లు పోగా నికరంగా రూ.1,20,000ల వరకు ఆదాయం మిగిలే అవకాశాలు ఉన్నాయి.

సిద్దవటం మండలంలోని కడపాయపల్లెలో సాగు చేసిన బెండపంట



అందుబాటులో మార్కెట్ సౌకర్యం

బెండ పంట సాగు చేసిన గ్రామలు కడపకు సమీపంలో ఉన్నాయి. దీంతో పొలాల్లో బెండకాయలను కోశాక రైతులు బస్తాలకు నింపి ఆటోల ద్వారా నిత్యం కడప మార్కెట్‌యార్డుతో పాటు పెద్దమార్కెట్‌కు తరలిస్తున్నారు. మార్కెట్‌లో ఏ రోజు ధర ఆ రోజే రైతుకు దక్కుతోంది. కొందరు రైతులు నేరుగా వారి ఉత్పత్తులను అమ్ముకుంటూ మరింత లాభాలను గడిస్తున్నారు.

హోంగార్డులసేవ ఆదర్శం

● తోటి హోంగార్డుకు రూ.4,14,640 ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ

కడప క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మానవత్వం, ఐకమత్యం కేవలం మాటల్లోనే కాదని జిల్లాలోని హోంగార్డులు నిరూపించారు. తమతో కలిసి విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఓ హోంగార్డుకు అండగా నిలబడి అభినందనలు అందుకున్నారు. వివరాలిలా.. ప్రొద్దుటూరు పట్టణంలో కమ్యూనికేషన్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల టి.విజయ రాజు (హెచ్‌జీ 85) పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఆయన అనారోగ్యంతో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తోడుగా నిలిచేందుకు జిల్లాలోని హోంగార్డులందరూ ముందుకు వచ్చారు. స్వచ్ఛందంగా ఒకరోజు వేతనాన్ని రూ.4,14,640 వితరణగా ఇచ్చారు. ఈ ఆర్థిక సాయాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ చేతుల మీదుగా చెక్కును జయరాజు కుటుంబానికి అందించారు. ఈసందర్భంగా హోంగార్డుల ఐకమత్యాన్ని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీశైలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



ఆలయ ప్రాంగణంలో హోమం చేస్తున్న అర్చకులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 4 ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. రెండవ రోజు ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వరస్వామికిస్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో ఉత్సవ మూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనములతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ఊరేగింపు వేడుకగా నిర్వహించారు. స్థానిక భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

170 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని కొత్తరోడ్డు ప్రాంతంలో గల రాజులకాలనీ వద్ద 170 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం పోలీసు సిబ్బందితో కలసి దాడి చేసి లారీలో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన 170 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ బియ్యం చెన్నూరుకు చెందిన బ్రహ్మయ్యకు చెందినవిగా గుర్తించి, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

చెన్నూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వెంకటసుబ్బయ్య (59) అనే వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలిపారు. గత నెల 29న వెంకటసుబ్బయ్య రుద్రభారతి పేట నుంచి అలంఖాన్‌పల్లెకు మూడు చక్రాల వాహనంలో వస్తుండగా మదీనా ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం కడపకు తరలించారు. అక్కడ నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గొలుసు చోరీ దొంగ అరెస్టు

కడప క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఉక్కాయపల్లె డంప్ యార్డు వద్ద ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును చోరీ చేసిన కేసులో దొంగను అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప నగరం గణేశ్‌నగర్‌కు చెందిన పరచూరి కిశోర్‌కుమార్ గత నెలలో ఉక్కాయపల్లె డంప్‌యార్డు వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కుని పారిపోయినట్లు తెలిపారు. అతనిపై నిఘా ఉంచి ఎస్ఐలు రవికుమార్, రాజరాజేశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం కిశోర్‌కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 16.500 గ్రాములు బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

రామాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలచెరువు తూర్పు భాగంలోని అటవీ ప్రాంతంలో 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకెళితే.. బుధవారం రాయచోటి ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీట్ ఆఫీసర్ ఎఫ్‌బీవో, ఫారెస్టు సిబ్బంది కొత్తిమడుగు బీట్‌లో కూంబింగ్ నిర్వహిస్తుండగా.. ఎర్రచందనం దుంగలు మోసుకొని వస్తున్న తమిళ కూలీలు, స్మగ్లరు తమ రాకను గమనించి దుంగలను వదిలేసి పారిపోయారని తెలిపారు. దుంగలను లెక్కించగా 13 ఉన్నాయని, వీటి విలువ రూ.1,80,000 ఉంటుందన్నారు. ఈ కూంబింగ్‌లో ఫారెస్టు అధికారి ఆర్.రెడ్డెప్ప, వాచర్స్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల అదృశ్యం



చెన్నూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరుకు చెందిన వెంకటసుబ్బయ్య (84), నాంచారమ్మ (80) అనే వృద్ధ దంపతులు అదృశ్యమయ్యారు. ఈ మేరకు వారి కుమారుడు ప్రసాద్ స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం రాత్రి పిర్యాదు చేశాడు. రెండురోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళుతున్నామంటూ చెప్పిన ఆ వృద్ధ దంపతులు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వారి ఆచూకీ తెలిస్తే 9440838584 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్ : ఎస్ఈ



చిలమకూరులో ట్రాన్స్‌ఫార్మర్‌ని పరిశీలిస్తున్న ఎస్ఈ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ పేర్కొన్నారు. గురువారం ఎర్రగుంట్ల, వీరపునాయుని పల్లె, కమలాపురం పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి దిశానిర్దేశం చేశారు. అంతకు ముందు ఆయన చిలమకూరులోని 33/11కేవీ సబ్‌స్టేషన్, పరిసరాలను, ట్రాన్స్‌ఫార్మర్స్‌ని పరిశీలించారు. అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం సూర్యఘర్‌తో ఇళ్లకు ఉచిత విద్యుత్ లభించనున్నదని.. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్త వ్యవసాయ కనెక్షన్లు రైతు లు అడిగిన 45 రోజుల్లోనే ఇస్తున్నామని, ప్రస్తుతం ఎక్కడా పెండింగ్ లేవన్నారు. 9గంటలు నిరంతరాయంగా విద్యుత్ రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడా లో ఓల్టేజి సమస్య, లైన్లలో విద్యుత్ లాస్ ఉండకూడదన్నారు. డీసీ లిస్టని జీరో తెచ్చినప్పుడే సంస్థకు మంచి మనుగడ ఉంటుంద న్నారు. ఇప్పటికీ కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిసున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాణాలు ఎంతో విలువైనవని సిబ్బంది అన్ని జాగ్రత్తలు పాటించి పనులు చేయాలన్నారు. కమలాపురం, వీఎన్‌పల్లె మండలాల్లో డీసీ లిస్ట్ శాతం ఇప్పటికీ అధికంగా ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, డీసీ లిస్టు జీరో చేసిన సిబ్బంది పవన్ తదితరులను శాలువాకప్పి సన్మానించారు. కార్యక్ర మంలో ఈఈ రమణారెడ్డి, డీఈఈ కిరణ్ కుమార్, ఏఈ హరి ప్రసాద్, చాంద్ బాషాలు, ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యం మేరకు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలి : కలెక్టర్



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఎంఐ ట్యాంకులు, గ్రౌండ్ వాటర్ సానుకూల దృక్పథం, సౌర పవన ప్రాజెక్టులు, భూ సమస్యలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీ రావు, సమచార పౌరసంబంధాలశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్‌బాబు తదితర రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్, జాయింట్‌కలెక్టర్ అదితిసింగ్‌లు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాల న్నారు. అభివృద్ధి పథకాలపై క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందువల్ల జిల్లా అంతటా పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టాలన్నారు. తడి పొడి చెత్తపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానానికి సంబంధించి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జలవనరుల రక్షణ పెంపు. సమ్మర్ స్టోరేజీలు నింపేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదన్నారు. ఖరీఫ్‌లో అవసరం మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయరంగంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ప్రారంభించిన పీఎం కుసుమ్ యోజన్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు సోలార్ పంపులు ఏర్పాటు, గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ పవర్ ప్లాంట్లను నెలకొల్పడం ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గించి అదనపు ఆదాయం చేకూర్చేలా సంబంధిత వ్యవసాయ నెడ్‌క్యాప్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, సంబందితశాఖల అధికారులు పాల్గొన్నారు.

శిల్పారామాన్ని సందర్శించిన ఛైర్‌పర్సన్



శిల్పారామాన్ని సందర్శిస్తున్న ఛైర్‌పర్సన్ మంజులారెడ్డి

కడప కల్చరల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీపంలో గల శిల్పారామాన్ని గురువారం సంబంధిత శిల్పారామాల ఛైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి కళ్యాణ మండపం, డార్మెంటరీ బోటింగ్, టికెట్ల కౌంటర్లు, గేమ్సులను పరిశీలించారు. అనంతరం శిల్పారామంలో జరుగుతున్న పనులు గురించి సంబంధిత పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటసుబ్బయ్యలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ ఇక్కడి కళ్యాణ మండపం నుంచి డార్మెంటరీ వరకు ఫెన్సింగ్ ఏర్పాటుకు నిధులు ఇచ్చామన్నారు. దీంతో పాటు స్కల్పచర్‌లో బొమ్మలకు పెయింటింగ్ కొరకు, మరికొన్ని అభివృద్ధి పనులకు సైతం నిధులు విడుదల చేస్తామన్నారు. ప్రధానంగా వాటర్ గేమ్సులను వైజాగ్, గుంటూరులలో ఏర్పాటు చేశామని.. ఆ కోవలో కడప శిల్పారామంలో కూడా ఏర్పాటు చేసేందుకు వీలుగా ఆసక్తి గల వారికి అనుమతిస్తామన్నారు. దీంతో పాటు చేతివృత్తుల వారికి సైతం స్టాల్స్ ఏర్పాటుకు వీలు గా తక్కువ అమౌంట్‌కే ఇస్తామన్నారు. రాష్ట్రంలోని శిల్పారామాలకన్నా కడప శిల్పారామాన్ని నగర ప్రజలకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దుతామని తెలిపారు.

జాయింట్ ఎల్‌పీ నెంబర్ల సమస్యలను పరిష్కరిస్తాం : ఆర్డీవో

కమలాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ద్వారా తలెత్తిన జాయింట్ ఎల్‌పీయం నెంబర్ల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతామని ఆర్డీవో జాన్ ఎర్విన్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమలాపురం మండలంలో రీసర్వే ద్వారా చాలావరకు భూములు జాయింట్ ఎల్‌పీ నెంబర్లు ద్వారా ఉన్నాయని. వాటితో సమస్యలు తెలత్తుతున్నాయని రైతులు తమ దృష్టికి తెచ్చారన్నారు. వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకంజలో కర్నూలు, అనంతపురం జట్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కడపలో సౌత్ జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే (మూడు రోజుల) ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో రెండవ రోజైన గురువారం వివిధ జట్ల మధ్య పోటీలు సాగాయి. ఈమ్యాచ్‌లలో కర్నూలు, అనంతపురం జట్లు ప్రత్యర్థి జట్ల కన్నా వెనుకంజలో ఎదురీదుతున్నాయి. నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-కడప జట్ల మధ్య సాగుతున్న క్రికెట్‌మ్యాచ్‌లో 304 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 88.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 374 పరుగులు చేసింది. ఇందులో విజయ్‌రామిరెడ్డి 80 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 65 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 261 పరు గులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 113 పరుగుల లోటుతో నిలిచింది. అలాగే కేఎస్‌ఆర్‌ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు- అనంత పురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 44.4 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. కాగా 196 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవరోజు గురువారం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 43.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో ఎక్కాక్షర్ 5 వికెట్లు పడగొట్టడం విశేషం. దీంతో నెల్లూరు జట్టుకు 43 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఇదిలా వుండగా నెల్లూరు జట్టు రెండవ ఇన్నింగ్స్‌కు దిగి 60 ఓవర్లలో 350 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో రోషన్ పవన్‌కుమార్ 83 పరుగులు, సుతేజ్‌రెడ్డి 81 పరుగులు చేశారు. కాగా, రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 3 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 14 పరుగులు చేసింది. ఆటకు శుక్రవారం చివరిరోజు.

ఉల్లిపై జగన్ మొసలి కన్నీళ్లు

● టీడీపీరాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పులివెందులలో పర్యటించి ఉల్లి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వంపై బురదచల్లాలన్నదే వైఎస్ జగన్ ఏకైక లక్ష్యమన్నారు. గురువారం కడప నగరం ద్వారకానగర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం, రైతు సంక్షేమానికి పనిచేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏనాడైన రైతుల గోడు పట్టించుకుందా అని ప్రశ్నించారు. మామిడి కొనుగోలు చేయలేదని ఆయన గుర్తు చేశారు. ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలని, అవసరమైతే స్టోరేజ్ చేసేలా చర్యలు తీసుకోవా లని సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారన్నారు. చెప్పిన మూడు రోజులకు జగన్ ఉల్లిపై మాట్లాడడం అవగాహన రాహిత్యమే అన్నారు. హంద్రీనీవా నుంచి పులివెందుల ఎర్రబల్లె చెరువుకు నీరు విడుదల అయిందని, ఒక్కరోజు అయిన నీ నియోజకవర్గానికి నీరు ఇచ్చారా అని జగన్‌ను సూటిగా నిలదీశారు. లోకేష్ హెరిటేజ్ మాది కాదు అని స్పష్టంగా చెప్పారన్నారు, అయితే భారతి సిమెంట్ పరిశ్రమ మాది కాదు అని చెబుతారా, సిమెంటు తక్కువకు ఇవ్వగలరా అని సవాల్ చేశారు. సచివాలయాల్లో, ప్రభుత్వ ఆసుపత్రిలో, వలంటీర్‌లకు పత్రిక పంపి సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. వర్షాలు పడుతున్నాయని, రైతులు పంటలు సాగుచేసుకున్నారని, రాష్ట్రంలో ఎక్కడ యూరియా కొరత లేదన్నారు. చెప్పిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు అవుతుంటే ఆ పార్టీ నేతలకు మతిభ్రమించి విమర్శిస్తున్నారని వారి విమర్శలను తిప్పి కొట్టారు.

వైద్య, 108 సిబ్బంది నిర్లక్ష్యంతోనే యువకుడి మృతి

● జిల్లా అధికారులకు కుటుంబీకుల ఫిర్యాదు

● డీఎంహెచ్‌వో విచారణ ● సిబ్బందిపై చర్యలకు సిఫార్సు



నర్సాపురంలో వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో నాగరాజు

కాశినాయన సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రం నర్సాపురం గ్రామానికి చెందిన బారాగజ్జి మహబూబ్ పీరా(27) అనే యువకుడు గురువారం వైద్య, 108 సిబ్బంది నిర్లక్ష్యంతో మృతి చెందినట్లు మృతుని కుటుంబీకులు ఆరోపించారు. వారి వివరాల మేరకు... ఇటీవల జ్వరంతో బాధపడుతున్న మహబూబ్‌పీరా గురువారం తెల్లవారు జామున శ్వాసపీల్చుకోవడం కష్టంగా ఉండటంతో 108 సిబ్బందికి సమాచారం ఇచ్చామన్నారు. వారు అందుబాటులో ఉన్నప్పటికీ నిర్లక్ష్యపు సమాధానంతో సకాలంలో స్పందించక పోవడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. అక్కడ ఎవరూ విధుల్లో లేకపోవడంతో ఓ ప్రైవేట్ వాహనంలో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా.. పరిస్థితి విషమించడంతో యువకుడు ఆసుపత్రికి చేరేలోపే చనిపో యాడు. సకాలంలో ఆక్సిజన్ అందించి ఉంటే చనిపోయేవాడు కాదని .. అక్కడి వైద్యులు తెలిపినట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు. దీనికంతటికి వైద్య ఆరోగ్య సిబ్బంది విధుల్లో లేకపోవడం, 108 సిబ్బంది సకాలంలో స్పందించకపోవడమే కారణమమని వాపోయారు. ఈవిష యంపై డీఎంహెచ్‌వోకు పిర్యాదు చేసి బాధితులపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ మేరకు డీఎంహె చ్‌వో నాగరాజు, డిప్యూటీ డీఎంహె చ్‌వో మల్లేష్ నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని విచారణ చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పుష్పతో పాటు స్టాఫ్ నర్సులను, ఏఎన్ఎంలను, 108 సిబ్బం దిని, మృతుడి కుటుంబీకులను జరిగిన సంఘటనపై సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించడం లేదని తాము గుర్తించామని.. స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 108 సిబ్బందిపై చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తామని తెలిపారు.

విద్యార్థుల ఉన్నతే గురువుకు సంతోషం

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తమ వద్ద విద్యాబుద్ధులు నేర్చిన పిల్లలు ఉన్నత స్థానాలకు ఎదిగినప్పుడే గురువులకు నిజమైన సంతోషమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆర్.మాధవి అన్నారు. గురువారం కడప నగరం గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్లో ఇంటాక్ లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య సంయుక్త ఆధ్వర్యంలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రను విద్యార్థులు అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, వైవీయూ రిజిస్ట్రార్ డాక్టర్ పద్మ తదితరులు మాట్లాడారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ విద్యావేత్తలు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

అట్టహాసంగా నిమజ్జనం



కడప కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా తొమ్మిదవ రోజైన గురువారం నగర ఎన్‌జీవో కాలనీలో వెలసిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి వాహనంలో ఊరేగింపుగా తీసుకెళ్లారు.

పవిత్రోత్సవాలకు అంకురార్పణ

కడప కల్చరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 4వ తేదీ గురువారం నుండి 7వ తేదీ వరకు స్వామివారి పవిత్రోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాలకు గురువారం వైభవంగా అంకురార్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణ, మృత్యోంగ్రహణం, విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, పవిత్రాధివాసం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు జ్ఞానాలయాలు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు పాఠకులకు జ్ఞానాలయాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ తెలిపారు. గురువారం కమలాపురం శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఇంకా ఏం పుస్తకాలు కావాలో పాఠకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరరం మున్సిపల్ కమిషనరు కార్యాలయానికి వెళ్లి బకాయి ఉన్న గ్రంథాలయ పన్ను చెల్లించాల్సిందిగా సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 27వ డివిజన్ ప్రజల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యిద్ గౌస్‌పీర్ కోరారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ నేతలు నగర కమిషనరు మనోజ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 27వ డివిజన్‌లో వారం రోజుల పాటు ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆ డివిజన్లో చాలామందికి రేషన్ కార్డులు లేవన్నారు. కరెంట్ సాకుతో తొలగించిన పథకాలను పునరుద్ధరించి పేదలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో షామీర్‌హుస్సేన్, యూసుఫ్, ముబారక్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేసిన సీఈవో

సీకేదిన్నె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీ సీఈవో సి.ఓబుళమ్మ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాన్ని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించి వెంటనే పరిష్కరించాలన్నారు. మండలాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కుళాయిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థి విజ్ఞాన్ మంథన్'ను సద్వినియోగం చేసుకోవాలి

కడప నాగరాజుపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రతిభను వెలికితీసే జాతీయ ప్రతిభా అన్వేషణా పరీక్ష (విద్యార్థి విజ్ఞాన్ మంథన్-2025)ను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష రాష్ట్ర అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కల్పన తెలిపారు. ఈ మేరకు స్థానిక సైన్స్ మ్యూజియంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభాన్వేషణ పరీక్షను ఎన్‌సీఈఆర్‌టీ, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్‌మ్యూజియం, విజ్ఞాన భారతి సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారికి భారతదేశ ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోందని, ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉందన్నారు. విద్యార్థులు www.vem.org.in వెబ్‌సైట్‌లో లాగిన్ కావాల న్నారు. కార్యక్రమంలో విద్యార్థి విజ్ఞాన్ మంథన్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసులరెడ్డి, సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ ఆఫీసర్ రమణమూర్తి పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందిస్తున్న పారిశుధ్య, నీటి సరఫరా కార్మికులు

వేంపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య, నీటి సరఫరా కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల పూటగడవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ గురువారం పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులుకు సమ్మె నోటీసును అందించారు. కొన్ని నెలలుగా రెగ్యులర్ ఈవో లేక పాలన కుంటుపడగా పారిశుధ్య, తాగునీటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందిపడ్డారు. పలుమార్లు పనులు నిలిపివేస్తామని ముందుకు రాగా అధికారులు, స్థానిక సర్పంచు, నాయకులు నచ్చజెప్పడంతో తిరిగి పనులు చేపట్టారు. కానీ ఎంతకీ ఆలస్యం కావడంతో ఇక పనులు చేయలేమంటూ సమ్మె నోటీసు ఇచ్చి పనులు నిలిపివేశారు. దీంతో పట్టణంలో ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం కనిపిస్తోంది. వెంటనే సమస్యను పరిష్కరించేందుకు జిల్లాస్థాయి అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

గిరి ప్రదక్షిణకు బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న భారవి

కడప కల్చరల్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి గిరిప్రదక్షిణకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈనెల 7వ తేదీ ఆదివారం కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని పుష్పగిరి తీర్థక్షేత్ర ధర్మపరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు భారవి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ క్రమంలో కడప నుండి చెన్నకేశవస్వామి దేవాలయం మీదుగా ఒక బస్సు అలాగే మైదుకూరు డిపో నుండి చెన్నకేశవస్వామి దేవాలయం మీదుగా కడపకు మరో బస్సును ఏర్పాటుచేసేలా సంబంధిత ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్‌ను ఆదేశించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భారవి కోరారు.

సమాజ రుగ్మతలను పారదోలే పాశుపతాస్త్రం ఉపాధ్యాయుడు



రాధాకృష్ణన్‌కు నివాళులు అర్పిస్తున్న నాగార్జున స్కూలు యాజమాన్యం

కడప నాగరాజుపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యను బోధించడమే కాదు.. సమాజాన్ని పీడించే రుగ్మతలను తరిమికొట్టే పాశుపతాస్త్రం ఉపాధ్యాయుడని నాగార్జున హైస్కూలు కరస్పాండెంట్ శివతులశమ్మ అన్నారు. గురువారం స్థానిక నాగార్జున హైస్కూల్‌లో టీచర్స్‌డేను పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. ముందుగా సర్వేపల్లె రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హెడ్‌మాస్టర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుడి చేతిలోనే ఉందని, రాజుకైనా, ప్రధానమంత్రికైనా గురువు ప్రధానమైన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కె.శివప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల చైర్మన్ శ్రీనివాసులు.. హాజరైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కాలానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్ సాంకేతికను అందిపుచ్చుకోవాలని రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పసుపులేటి శంకర్ అన్నారు. గురువారం కడపనగర శివారులోని శ్రీనివాస ఇంజనీరింగ్ కళాశాలలో ఒక్కరోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ కలిగి ఉంటే అన్ని సాధించవచ్చన్నారు. కళాశాల చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగం సాధించే విధంగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.నాగరాజ మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజలకు సముచిత స్థానం కల్పించాలి



విలేకరులతో మాట్లాడుతున్న బలిజ సంఘం ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బలిజ సామాజిక వర్గానికి తెలుగుదేశం పార్టీలో సముచితస్థానం కల్పించాలని బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో బలిజలు 27శాతం ఉన్నారని, టీడీపీ ఆవిర్భావం నుంచి బలిజలు అండగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బాలిశెట్టి హరిప్రసాద్ కృషిచేశారని తెలిపారు. రాయలసీమ బలిజ సంఘం నాయకుడు చెన్నంశెట్టి మురళి మాట్లాడుతూ గతంలో ఇదే టీడీపీ హయాంలో ఎన్నికల నోటిఫికేషన్‌కు ఒక్కరోజు ముందు అడా చైర్మన్‌గా హరిప్రసాద్ ఇచ్చారని, కేవలం ఆ పదవి ఒక్కరోజు ముచ్చటే అయిందన్నారు. ముక్కా రూపానందరెడ్డి ఎన్నికలకు ముందు పార్టీలోకి వస్తే అడా చైర్మన్ ఇచ్చారన్నారు. జిల్లాలో కేవలం ఒక సామాజికవర్గం మాత్రమే పెత్తనం చేస్తున్నారని తెలిపారు.

రైతులను ఇబ్బంది పెట్టరాదు

● ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ గీతావాణి



చెన్నూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎరువుల ధరల విషయంలో రైతులను ఇబ్బంది పెట్టరాదని విజిలెన్స్ డిప్యూటీ అసిస్టెంటు కమిషనర్ బి.గీతావాణి సూచించారు. గురువారం చెన్నూరులోని ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. దుకాణాలు ఎన్ని, అందులో స్టాకు ఎంత, వాటిని నిర్ణీత రేటుకు అమ్ముతున్నారా, లేదా వంటి విషయాలపై ఆరా తీశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని దుకాణాదారులను హెచ్చరించారు. ఇటీవల ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడతున్నారన్న కథనాలు పత్రికల్లో వస్తున్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఈ తనిఖీలు చేసి దుకాణ యజమానులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం రైతులకు యూరియాను పంపిణీ చేశారు. యూరియా కొరత ఉందని రైతులు ఆందోళన పడవద్దని, మరలా రెండురోజుల్లో వస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సీఐ క్రిష్ణారెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు

లింగాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సహకార సంస్థ నుంచి త్వరలో రైతులకు నాణ్యమైన ఎరువులు సరఫరా చేస్తామని సొసైటీ అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. లింగాల సొసైటీలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సొసైటీ సేవలు ఆన్‌లైన్ చేయడం జరిగిందని, రైతులకు విరివిగా పంట రుణాలు, ఉద్యాన పంటల సాగు కోసం దీర్ఘకాలిక రుణాలు, పాడి రైతుల కోసం గేదెల కొనుగోలుకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో బీజేపీ నాయకుడు మహేశ్వరరెడ్డి, టీడీపీ నాయకుడు ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

చక్రాయపేట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు సమస్యను వెంటనే పరిష్కరించాలని జడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కె.రాజుపల్లెలో వాటర్ స్కీం ఉందని, తద్వారా గ్రామాలకు నీటి సరఫరా చేస్తుండడం జరుగుతోందన్నారు. అయితే మండలంలోని బాలతిమ్మయ్యగారిపల్లె రహదారిని విస్తరణ పనుల్లో భాగంగా తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులకు గురైందన్నారు. దీంతో మహబూబ్‌నగర్, బోడిగుండుపల్లె, కుప్పగట్టుపల్లె, మల్లికవాండ్లపల్లె, పాయలోపల్లె, లక్ష్మీపురం గ్రామాల ప్రజలకు తాగునీరు అందడం లేదన్నారు. ఈ పైప్‌లైన్ పనులు త్వరితగతిన పూర్తి చేసి తాగునీటిని అందించాలని ఆయన అధికారులను కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చెన్నూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురిసే వర్షాలతో వచ్చే వాతావరణ మార్పులతో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ఈ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వినయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని దౌలతాపురంలో ఆప్రాంత గిరిజనుల కోసం గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించి జ్వరపీడితులకు రక్తపరీక్షలు చేశారు. అలాగే అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఇంటింటికి వెళ్లి జ్వరాల సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని నిల్వ ఉంచకూడదని, కొండ దిగువన ఉన్న గిరిజన ప్రాంతాల ప్రజలు రాత్రివేళ దోమతెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీబీఆర్‌ను పరిశీలించిన తులసిరెడ్డి

లింగాల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)ను గురువారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీబీఆర్ ప్రాజెక్టు పులివెందుల నియోజకవర్గంలో సాగు, తాగునీటి అవసరాలు, కదిరి,పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లో తాగునీటి అవసరాలు తీరుస్తోందన్నారు. 1989లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినప్పటికి పూర్తి చేసింది మాత్రం కాంగ్రెస్ అని, 2009లో పూర్తి వినియోగంలోకి వచ్చిందన్నారు. అనంతరం వెలిదండ్ల దేవరకోనలో జరుగుతున్న చాతుర్మాస దీక్షల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఉన్నత ఉద్యోగ అవకాశాలపై శిక్షణ

వేంపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉన్నత ఉద్యోగాలైన ఐఏఎస్, ఐపీఎస్ వంటి పోటీ పరీక్షలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ట్రిపుల్‌ఐటీ అధికారులు చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన కోనం ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంపిక చేసుకొని శిక్షణతో పాటు స్టైఫండ్ అందిస్తామని కోనం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పొందేందుకు శిక్షణ ఇస్తున్నారని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏవో రవికుమార్, లైబ్రేరియన్ కోనప్ప కోరారు.

గృహనిర్మాణ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా జగన్నాథరెడ్డి

వేంపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా మండలంలోని రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచు బోరెడ్డి జగన్నాథరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా జగన్నాథరెడ్డిని మండలంలోని పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు కలిసి అభినందించారు. అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా పనిచేసి పేదలకు న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

విజయదుర్గాదేవి సేవలో నటుడు అశ్విన్‌బాబు

కడప కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడు అశ్విన్‌బాబు గురువారం కడప బిల్టప్ సమీపంలో ఉన్న విజయదుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రసాదాలను స్వీకరించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న అశ్విన్‌బాబుకు ఆలయ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు.



అమ్మవారి సేవలో సినీనటుడు అశ్విన్‌బాబు

జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు

బి.కోడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువా రం బి.కోడూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయకిరణ్‌ల ఆధ్వర్యంలో నేత్ర దాన పక్షోత్సవాలు ఘనంగా జరిగాయి. కంటి వైద్యాధికారి హుసేనయ్య మాట్లాడుతూ కళ్లు దానం చేస్తే ఇద్దరికి చూపును ప్రసాదించినట్లవుతుందన్నారు.

108 వాహనంలో ప్రసవం

కొండాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెడుదూరుకు చెందిన లక్ష్మీదేవి అనే మహిళ 108వాహనంలో ప్రసవించింది. తాడిపత్రికి తీసుకెళుతుండగా నొప్పులు ఎక్కువ కావడంతో వాహన సిబ్బంది డెలివరి చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది.

మాజీ ఎమ్మెల్యేను కలిసిన ఏపీపీ శివరామక్రిష్ణ



మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌లను సన్మానిస్తున్న అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్

బద్వేలుటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఎన్నికైన అడిషినల్ పబ్లిక్‌ప్రాసి క్యూటర్ డీవీఎస్ శివరామక్రిష్ణ గురువారం టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే విజ యమ్మను, నియోజకవర్గ ఇన్ చార్జి రితేష్‌కుమార్‌రెడ్డిలను మర్యా దపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వారు ఇద్దరూ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్‌లో న్యాయవాద వృత్తిలో మరెన్నో పదవులను అలంకరిం చాలని మనస్ఫూర్తిగా కోరుకుం టున్నట్లు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌కుమార్‌రెడ్డిలు అభి నందనలు తెలిపారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కోర్టుదగ్గరకు వస్తారని వారికి న్యాయంచేసేలా కృషి చేయాలని వారు తెలిపారు. అనంతరం వారిని ఏపీపీ ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.

బి.మఠం ప్రభుత్వ వైద్యశాల తనిఖీ

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :బ్రహ్మంగారిమఠం ప్రభుత్వ వైద్యశాలను గురువారం మండల అధ్యక్షుడు వీరనారాయణరెడ్డి తనిఖీ చేశారు .ఈ సందర్భంగా ప్రస్తుతం వస్తున్న జ్వరాలను అంటువ్యాధులపై రక్తపరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. అలాగేప్రస్తుతం వైద్యశాలలో సిబ్బంది కొరత ఉందా అని అక్కడ పనిచేస్తున్న వైద్యాధికారి ఓబులేసును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సేవలను ప్రజలకు అందించాలని డీఎంహెచ్‌వోకు ఫోను చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షుడు శీలం నరసింహగౌడ్, వైద్యసిబ్బంది ఉన్నారు.

టికెట్ అల్ట్రా పల్లెవెలుగు.. బస్సు నాన్‌స్టాప్

- ఇదెక్కడి న్యాయమంటున్న మహిళలు
- ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామంటున్న అధికారులు



జమ్మలమడుగు బస్టాండులో నాన్‌స్టాప్ బస్సు

అల్ట్రా పల్లె వెలుగు టికెట్

జమ్మలమడుగు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టికెట్టు అల్ట్రా పల్లెవెలుగు.. బస్సు నాన్‌స్టాప్ ఇదెక్కడి న్యాయమం టూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. జమ్మలమడుగు ఆర్టీసీ డిపో నుంచి ప్రతిరోజు నాన్‌స్టాప్ సర్వీసులు పల్లె వెలుగు బస్సులను మాత్రమే తిప్పుతున్నారు. బస్సు లేమో పల్లెవెలుగు. అదే బస్సులో అల్ట్రాపల్లె వెలుగు అనే పేరుతో రూ.35 టికెట్టు ఇస్తున్నారు. జమ్మలమడుగు- ప్రొద్దుటూరు నాన్‌స్టాప్ సర్వీసులు ఎక్కువగా ఉన్నాయి. ప్రైవేటు ఉద్యోగాలు చేసేవారు, దుకాణాల్లో పనులు చేసుకునేవారు, ఇరత్రా ఎక్కువ మంది జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు వెళుతుంటారు. ఇందులో అల్ట్రాపల్లెవెలుగు బసుల్లో స్త్రీశక్తి పథకం ఎందుకు వర్తించదని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి అల్ట్రా(పల్లెవెలుగు) జమ్మలమడుగు నుంచి తాడిపత్రికి వెళుతుంటే వాటిలో మాత్రం మహిళలకు స్త్రీ శక్తి పథకం వర్తిస్తుందని కానీ అలాంటి బస్సులే జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్నప్పటికి వాటికి నాన్‌సాప్ పేరుతో బస్సులను తిప్పుతూ అందులో స్త్రీ శక్తి పథకం వర్తించదని చెప్పడం ఏమిటన్నారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి స్పందించి తమకు నాన్‌స్టాప్ సర్వీసుల్లో స్త్రీ శక్తి పథకం వర్తింపజేసేలా చేయాలని మహిళలు కోరుతున్నారు.

డీఎం ఏమన్నారంటే: ఈ విషయమై జమ్మలమడుగు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రవీణ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా నాన్‌స్టాప్ సర్వీసులు ప్రొద్దుటూరుకు తిప్పుతున్నామని, అయితే అందులో అల్ట్రా పల్లె వెలుగు బస్సులకు రూ.35 టిక్కెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సమస్యను జిల్లా అధికారులకు తెలియజేశామని, నాన్‌స్టాప్ సర్వీసుల్లో స్త్రీ పథకం వర్తింపజేయాలని తమకు ఫోన్లు వస్తున్నాయని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూస్తాం

పోరుమామిళ్ల సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మేజరు పంచాయతీలో తాగునీటి సమస్య తలెత్తకండా చూస్తామని పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ అన్నారు. గురువారం పోరుమామిళ్ల ప్రధాన రహదారిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా దెబ్బతిన్న పైపులైన్లను, వీధులకు సరఫరా అయ్యే వాల్వ్‌లను ఆయన పరిశీలించారు. దెబ్బతిన్న చోట మరమ్మతులు చేయించి ప్రధాన వీధులకు వెళ్లే కనెక్షన్‌లను మార్చి అన్నివీధు లకు నీరు సరఫరా అయ్యేలా చూస్తామ న్నారు. రెండురోజుల్లో ఈ మరమ్మతులన్నీ చేయిస్తామన్నారు. అలాగే చిదానందనగర్ లో తాగునీటికి ఇబ్బందిపడకుండా అక్కడ వారికి కొత్త మోటరును ఏర్పాటు చేశారు.

బాల్‌బ్యాడ్మింట్ జట్ల ఎంపిక

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం ఎస్.ఉప్పలపాడు హై స్కూలులో ఈ నెల 7న జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సీనియర్స్ జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, కార్యదర్శి వెంక రమణలు తెలిపారు. 7వ తేదీ ఉదయం 9 గంటలకు బాలబాలికలకు పోటీలు ప్రారంభం అవుతాయని, 2006 జనవరి 2 తర్వాత పుట్టినవారు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. పోటీలకు వచ్చే క్రీడాకారులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్, 10వ తరగతి మార్కులిస్టు, 8 ఫోటోలు, డ్రస్‌కోడ్, బూట్లతో రావాలన్నారు.

ఉల్లి రైతులకు రూ.3వేలు ఇవ్వాలి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉల్లిపంట సాగు చేసే రైతులకు గిట్టుబాటు ధర క్వింటాకు రూ.3వేలు చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎర్రగుంట్ల మండలంలోని దండుపల్లెలో ఆయన పర్యటించి మాట్లాడుతూ జిల్లాలో పదివేల ఎకరాల్లో ఉల్లిసాగు చేశారన్నారు. ప్రస్తుత మార్కెట్ ధర, ఉల్లి దిగుబడితో పోలిస్తే పెట్టుబడులు రాక నష్టపోతున్నారన్నారు. ఎంవీసుబ్బారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

1098 హెల్ప్‌లైన్ పై అవగాహన

ముద్దనూరు సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలికల, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థినులకు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098 పై గురువారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అందులో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్ మాట్లాడుతూ 1098 నంబరు పిల్లల రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందని, 24గంటలు అందుబాటులో ఉంటుందన్నారు.

ఆర్థిక సంఘం నిధులు విడుదల

మైలవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.06 కోట్లు మంజూరైనట్లు ఎంపాడీవో రామచంద్రారెడ్డి గురువారం తెలిపారు. ఈ నిధులను గ్రామ పంచాయతీలోని హరిత రాబారులకు జీతాలు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ కు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు.

వైభవంగా గణేశ్ నిమజ్జనం

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని అయ్యప్పనగర్‌గామంలో విఘ్నేశ్వరస్వామి 9వ రోజు గ్రామ పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించి బ్రహ్మంసాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం ప్రత్యేక పూజలు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

బద్వేలు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా సుప్రజ



పోరుమామిళ్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా నారిశెట్టి సుప్రజ ఎన్నికయ్యారు. పోరుమామిళ్ల మండలం టేకూరుకు చెందిన నారిశెట్టి నాగేంద్ర సతీమణి నారిశెట్టి సుప్ర జకు ఈ పదవి దక్కింది. బలిజ సామాజిక వర్గానికి చెందిన మహిళ మొట్టమొదటిసారిగా బద్వేలు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడం విశేషం. ఈమె భర్త నాగేంద్ర పోరుమామిళ్ల బీజేపీ మండల అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. బీజేపీలో చేసిన సేవలకు గుర్తించి కూటమి ప్రభుత్వం నాగేంద్ర సతీమణికి ఈ పదవి దక్కేందుకు సిఫారసు చేసింది. సుప్రజ బీఎస్సీ బీఈడి వరకు విద్యాభ్యాసం చేసింది. ప్రస్తుతం వారు పోరుమామిళ్లలో రెడ్డినగర్‌లో నివాసం ఉంటున్నారు. సుప్రజకు పదవి దక్కడంతో బలిజ సామాజిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతుంది.

ప్రొద్దుటూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా సురేఖ



ప్రొద్దుటూరు , సెప్టెంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : ప్రొద్దుటూరు మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా వద్ది సురేఖను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వద్ది సురేఖ భర్త వద్ది బాలుడు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి ముఖ్య అనుచరుడుగా గుర్తింపు ఉంది. చేనేత కులాల్లో పద్మశాలీ కులానికి చెందిన వద్ది బాలుడు గతంలో డీసీసీ బ్యాంకు డైరెక్టరుగా కూడా పనిచేశారు. కూటమి ప్రభు త్వంలో మార్కెట్ యార్డు చైర్మన్‌గా బీసీ మహిళకు దక్కడం పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే వరదరాజు లరెడ్డికి వద్ది బాలుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

మైదుకూరు ఆర్టీసీ డీఎంగా శ్రీలత



మైదుకూరు రూరల్,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మైదుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా ఎం. శ్రీలత గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్త్రీ శక్తి పథకంలో మహిళా ప్రయాణికులకు బస్సుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బందికి తగు సూచనలు ఇస్తామని ఈ సందర్భంగా డీఎం తెలిపారు.

సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులకు ఆదర్శం



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్‌కాలేజీ ప్రిన్సిపాల్ త్రివిక్రంరెడ్డి

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయులకు ఆదర్శనీయుడని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.త్రివిక్రంరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ సెలవు కావడంతో ముందస్తుగా గురువారం కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలు, ఉపాధ్యాయ దినోత్సవం గురుపూ జోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివప్రసాద్, రామంజనే యరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.



మైలవరంలో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యార్థులు

మైలవరంలో: మండల పరిధిలోని చిన్నకొమెర్ల జిల్లా పరిషత్‌లో ముందస్తుగానే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత మాట్లాడుతూ ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం

కొండాపురంలో: మండలంలోని టి.కోడూరు జడ్పీహైస్కూల్‌లో ముందస్తుగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించి పలువురు ఉపాధ్యాయులను సన్మానించగా విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మహనందిరెడ్డి ఈ ఏడాది 10 వతరగతిలో పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రో త్సాహక బహుమతులను అందజేశారు.అదేవిధంగా ఎంఈవో ఓబులేసు, ఉపాధ్యాలయులను ఆయన ఘనంగా సన్మానించారు.

హైస్కూల్‌గా మారినందుకు పలువురికి సన్మానం

కొండాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బెడుదూరు గ్రామంలోని అప్పర్‌ప్రైమరీ స్కూల్ జడ్పీహైస్కూల్‌గా మారినందుకు గ్రామస్థులు పలువురిని సన్మానించారు. ఇదివరకు తమ గ్రామంలో 8 వతరగతి ఉన్న పాఠశాల 10 వతరగతి వరకు అప్‌గ్రేడ్ అయినందుకు సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఎంఈవో రామయ్యతో పాటు పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు , గ్రామస్థులు పాల్గొన్నారు.

మహిళల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

మైలవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మహిళల, విద్య, గ్రామ పాలనలో మహిళా భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి మార్గం ఏర్పడుతుందని డివిజన్ అభివృద్ధి అధికారి రామాంజనేయులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల చట్టాలు, గ్రామ పాలనలో మహిళల భాగస్వామ్యం, గ్రామ పంచాయతీ అభివృద్ధి గురించి అవగాహన కల్పించారు. ఎంపీడీవో రామచంద్రారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అక్షరాస్యతపై వలంటీర్లకు శిక్షణ

అట్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):అట్లూరు మండలంలోని మండల సమాఖ్య భవనంలో అక్షరాస్యతపై వలంటీర్లకు గురువారం ఎంపీడీవో వెంగమునిరెడ్డి శిక్షణ తరగతులు నిర్వహించారు. మండలంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు కనీసం సంతకం రాయడం, చదవడం పదిమంది నిరక్షరాస్యులకు ఒక వలంటీరును నియమించి ప్రభుత్వం ఉల్లాస్ అనే సంస్థను ద్వారా ఏర్పాటు చేసిందని ఎంపీడీవో తెలిపారు. మండలంలో 12 పంచాయతీలు గ్రామాల్లో 150 మంది వలంటీర్లు పనిచేసేందుకు నియమించడం జరిగిందని వారు సాయంత్రం ఒక గంట పాటు అక్షరాభ్యాసం నిర్వహిస్తారన్నారు. ఈ ఏపీయం సురేశ్‌బాబు, ఏపీవో జయచంద్ర, మండల సమాఖ్య మహిళలు పాల్గొన్నారు.

ఫీల్డ్‌అసిస్టెంటు మృతి.. ఉపాధి అధికారుల సాయం

పోరుమామిళ్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గానుగపెంటపంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంటుగా పనిచేస్తున్న బత్తినరమణ మృతిచెందారు. గతంలో ప్రమాదానికి గురైన రమణ కోమాలోకి వెళ్లి కర్నూలులో చికిత్స పొందుతూ మరణించాడు. అతని మృతదేహాన్ని గురువారం స్వగ్రామానికి తీసుకు వచ్చారు. విషయం తెలుసుకున్న ఉపాధి సిబ్బంది మృతుని స్వగ్రామమైన రౌతుపల్లెకు వెళ్లి ప్రభుత్వం తరపున అతని దహన సంస్కారాలకు రూ.15వేలు ఏపీవో రవీంద్రరెడ్డి, ఈసీ ఖాజా, వారి కుటుంబ సభ్యులకు అందించారు. ప్రభుత్వం తరపున అతనికి రావలసిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతునికుటుంబానికి సీఎం సహాయనిధి కింద నిధులు మంజూరయ్యేలా చేయాలని అధికారులను కోరారు.

గంజాయి నియంత్రణకు ఈగల్‌టీం పర్యటన

జమ్మలమడుగు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో గురువారం ఈగల్‌టీం బృందం పర్యటించారు. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాను డ్రగ్స్ రహితంగా మార్చడానికి కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందని బృందం తెలిపారు. జమ్మలమడుగు అర్బన్ సీఐ నరేష్‌బాబు ఆదేశాల మేరకు పలు చోట్ల తనిఖీలు చేపట్టారు. అలాగే వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంలో సైతం తనిఖీలు చేపట్టినట్లు వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో పాటు జమ్మలమడుగు అర్బన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు

బద్వేలు, సెప్టెంబరు 4, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాద్రినగర్, రామాంజనేయనగర్‌లలో జ్వరాల నియంత్రణకు గురువారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎంపీడీఈవో మల్లిశ్వరీ ప్రజలను జ్వరాల గురించి అడిగి తెలుసుకున్నారు. మెడికల్ క్యాంపుతోపాటు రక్త పరీక్షలు, ఇంటింటి లార్వాసర్వే , పాఠశాల అంగన్వాడీకేంద్రాలను దర్శించి భోజనాలు , పౌష్టికాహారం గురించి తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏ జనార్ధన్‌రావు, సీహెచ్‌ఓ వీణ, ఏఎన్ఎం దీపిక తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల సమస్య పరిష్కారానికి చర్యలు

దువ్వూరు, సెప్టెంబరు 4 ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం మనేరాంపల్లి వద్ద పాడైన తారు రోడ్డు పనులు మొదలు పెట్టారు. గుడిపాడు నుంచి మనేరాంపల్లి, అటు నుంచి చల్లబసాయిపల్లె తెలుగుగంగ కాలువ వరకు ఈ దారిన నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో నాలుగేళ్లకిందట మనేరాంపల్లెలో రోడ్డు పాడై దారిలో పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. రాకపోకల సమయంలో స్కూటర్లు అదుపు తప్పి కిందపడుతున్నాయి. ప్రమాదాలు జరిగి పలువురు గాయనట్లు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం మరమ్మతులతో ప్రమాదాలు నివారించినట్లు అవుతుందని ప్రజలు భావిస్తున్నారు.